సాక్షి కర్నూలు

శనివారం : 18 : జనవరి : 2025



ఊరికి దేవుడొచ్చాడు !

ఆళ్లగడ్డ: పార్వేటగా బయలుదేరిన అహోబిలేశుడు ఊరూరా పూజలందుకుంటూ శుక్రవారం ఆర్.కృష్ణాపురం చేరుకున్నారు. స్వామి పల్లకీ రాకతో గ్రామంలో తిరునాల సందడి నెలకొంది.



ఇంతకూ మేమెవరం?

ఉండటానికి ఇల్లు లేదు.. తినడానికి తిండి లేదు.. కనీసం ఫలానా అని చెప్పేందుకు కూడా వారికి చిరునామా లేదు. ఆధార్ కార్డులేక ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నారు. IIలో▸



తాడిపత్రిలో దారుణం

వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణం బలి తీసుకుంది. పరాయి మహిళ మోజులో పడిన ఓ వ్యక్తి చివరకు కట్టుకున్న భార్యను వేటకొడవలితో నరికి హతమార్చాడు. IIలో▸

న్యూస్‌రీల్

కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ద్వారకానాథ్ రెడ్డి

కర్నూలు (సిటీ): జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వారికి పర్యవేక్షక ఇంజినీర్లుగా పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ద్వారకానాథ్ రెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పర్యవేక్షక ఇంజినీర్‌గా రెగ్యులర్ అధికారి లేకపోవడంతో డిప్యూటీ ఎస్‌ఈగా పనిచేస్తున్న బాలచంద్రారెడ్డి ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. తెలుగుగంగ కడప సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ద్వారకానాథ్ రెడ్డిని రెగ్యులర్ ఏస్‌ఈగా నియమించారు. ఈయన ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పదవీ విరమణ పొందనున్నారు. అలాగే తెలుగుగంగ పర్యవేక్షక ఇంజినీర్‌గా ఎస్.శివప్రసాద్‌రెడ్డిని నియమించారు. ఈయన ప్రస్తుతం జలవనరుల శాఖ విజయవాడ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్-1 కార్యాలయం పర్యవేక్షక ఇంజినీర్‌గా రెగ్యులర్ అధికారి లేరు. ప్రస్తుతం అక్కడ అవుకు రిజర్వాయర్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వెంకట సురేష్ బాబు ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా పనిచేస్తున్నారు.

దేహదారుఢ్య పరీక్షలో 243 మంది ఎంపిక




లాంగ్‌జంప్‌లో పోటీ పడుతున్న కానిస్టేబుల్ అభ్యర్థి

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలం మైదానంలో పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం ఎనిమిదవ రోజు 600 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 323 మంది బయోమెట్రిక్ పరీక్షకు హాజరయ్యారు. వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ చుట్టు కొలతలు వంటి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనపరచి 243 మంది అభ్యర్థులు ప్రధాన పరీక్ష (మెయిన్స్)కు అర్హత సాధించారు. ఏదైనా సమస్యలపై ఇతర కారణాలతో అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు ఈనెల 28వ తేదీన హాజరుకావాలని పోలీసు అధికారులు సూచించారు.



చదువు భారం అధనం

- పదో తరగతి విద్యార్థులకు అందని స్టడీ మెటీరియల్
- పీడీఎఫ్ కాపీ ఇచ్చి ప్రింట్ చేయించుకోవాలంటున్న అధికారులు
- విద్యార్థులపై రూ.2.91 కోట్ల భారం
- ఆరు సబ్జెక్టులు.. ఏడు ప్రశ్నపత్రాలుగా పరీక్షలు
- మారిన ప్రశ్నపత్రాలపై సాధన చేయలేని విద్యార్థులు



ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

> పదో తరగతి పరీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. అయితే సమయం సమీపిస్తున్నా స్పందించడం లేదు. నామమాత్రంగా ప్రత్యేక తరగతులతో కాలయాపన చేస్తోంది. స్టడీ మెటీరియల్ ఇవ్వడంలోనూ ఉత్సాహం చూపడం లేదు. ప్రశ్నపత్రాలు మారడం.. స్టడీ మెటీరియల్ తీసుకోవడానికి అ'ధన'పు భారం మోపడం..తదితర కారణాలతో విద్యార్థులు సతమతమవుతున్నారు.

కర్నూలు సిటీ: పదో **తరగతిలో** ఉత్తమ ఫలితాలు **సాధిం**చేందుకు రాష్ట్ర వ్యాప్త**ంగా** ఒకే ప్రణాళిక**ను** విద్యాశాఖ తయారు చేసింది. ఆ ప్రణాళిక ప్రకారం చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించి**న** స్టడీ మెటీరియల్‌ను **అం**దజేయాల్సి ఉంది. **అయితే** ఇంత వరకు ఆ వైపు**గా చర్యలు** చేపట్టలేదు. స్టడీ **మెటీరియల్ ఇచ్చేం**దుకు తమ దగ్గర నిధులు లేవు అంటూ విద్యార్థుల పైనే భారం వేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలోని ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఎయిడెడ్, ప్రభుత్వ హైస్కూల్స్ మొత్తం 560 ఉన్నాయి. ఈ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు 35,014 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి ఏటా జిల్లా సాధారణ పరీక్షల విభాగం నుంచి స్టడీ మెటీరియల్ ఇచ్చేవారు. అయితే ఈ ఏడాది నిధులు లేవని, రాష్ట్ర విద్యాశాఖ తయారు చేసిన క్వశ్చన్ బ్యాంకు, మోడల్ ప్రశ్నపత్రాలతో కూడిన బుక్‌లెట్లను పీడీఎఫ్ ఫైల్ రూపంలో వచ్చినవి అలాగే స్కూళ్లకు పంపించారు. విద్యార్థులనే ప్రింట్ తీసుకుని చదువుకోవాలని సూచనలు చేయనున్నారు. లాంగ్వేజెస్ బుక్‌లెట్ 198, నాన్ లాంగ్వేజెస్ 218 పేజీలు ఉంది. ఈ రెండింటిని ప్రింట్ తీసుకోవాలంటే ఒక్కో పేపరుకు కనీసం రూ.2 చొప్పున తీసుకుంటారు. దీని వలన విద్యార్థులపై స్టడీ మెటీరియల్ భారం రూ.2.91 కోట్లకుపైగానే ఉంటుందని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

అప్పుడిలా.. ఇప్పుడు ఇలా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం **పదో తరగతి విద్యార్థు**లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితాల పెంపునకు ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలు ఆయా మండలాల ఎంఈఓలపైనే కాకుండా జిల్లా అధికారులకు సైతం అప్పగించింది. విద్యార్థులను ఆయా సబ్జెక్టు టీచర్లకు దత్తత ఇచ్చేలా చర్యలు తీసుకుంది. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించింది. అయితే రాష్ట్రంలోని ఉన్న ప్రస్తుత 'కూటమి' ప్రభుత్వం అలాంటి చర్యలేవీ చేపట్టలేదు. విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వకుండా అ'ధనం' భారం వేసేందుకు సిద్ధం అయ్యింది.

పరీక్షల నిర్వహణ ఇలా..

2020లో ఆరో తరగతిలో ఉన్న విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు ఇంగ్లిష మీడియంతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో కూడిన పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను మాత్రం ఎస్‌ఎస్‌సీ నిర్వహిస్తుంది. ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్ల విధానంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్ణయించింది. సైన్స్ సబ్జెక్టులో భౌతిక, రసాయన శాస్త్రం ఒకటిగా, జీవ శాస్త్రం ఒకటిగా 50 మార్కుల చొప్పున రెండు పరీక్షలు నిర్వహించున్నారు. మిగిలిన ఐదు సబ్జెక్టులకు సంబంధించి ఐదు పరీక్షలు 100 మార్కులకు ఉంటుంది. వంద మార్కుల విభాగంలో 33 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-1లో అబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు 12 ఉంటాయి. వీటిలో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉండగా.. అన్ని రాయాలి. సెక్షన్-2లో రెండు మార్కుల ప్రశ్నలు ఎనిమిది ఉండగా.. అన్ని రాయాలి. సెక్షన్-3లో ఎనిమిది ప్రశ్నలు ఉండగా.. ఒక్కోదానికి నాలుగు మార్కులు ఉంటాయి. సెక్షన్-4లో ఐదు ప్రశ్నలు.. ఎనిమిది మార్కుల చొప్పున ఉంటాయి. ఈ విభాగంలో మాత్రమే ఒక్కో ప్రశ్నకు ఏ,బీ అని రెండు ప్రశ్నలు ఉండగా.. ఒకటి చాయిస్ ఉంటుంది. మొత్తం 3.15 గంటల సమయం ఇస్తుండగా అన్ని ప్రశ్నలు రాయాలి. 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు, ఆ తరువాత అడిగితే మరో 12 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు.

నిధులు లేవు

పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు గతంలో స్టడీ మెటీరియల్‌ను డీసీఈబీ ద్వారా ఇచ్చేవాళ్లం. అయితే డీసీఈబీలో నిధులు అందుబాటులో లేకపోవడంతో ఈ ఏడాది స్టడీ మెటీరియల్ ఇవ్వలేకపోతున్నాం. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం అధికారులే తయారు చేసి పంపించిన క్వశ్చన్ బ్యాంకు, మోడల్ క్వశ్చన్ పేపర్ల బుక్‌లెట్లు పీడీఎఫ్ ఫైల్స్‌ను స్కూళ్లకు పంపించాం. వాటిని ప్రింట్ తీసుకోవాలని తెలియజేశాం. – నాగరాజు, డీసీఈబీ సెక్రటరీ

రమణీయం.. పుష్పోత్సవం



శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి ప్రారంభమైన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సమూర్తులను ఆలయ అలంకార మంపడంలోకి తోడ్కొని వచ్చి అశ్వవాహనంపై అధిష్టింపజేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించారు. అశ్వవాహనంపై విహరించిన స్వామిఅమ్మవార్లను పలువురు భక్తులు దర్శించుకున్నారు. సంక్రాంతి పర్వదినం రోజున నూతన వధూవరులైన పార్వతీ, మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు 18 రకాల పుష్పాలు, 11 రకాల ఫలాలు నివేదించారు. శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. – శ్రీశైలంటెంపుల్

ఆ.. ఆకలి.. ఊ.. ఊరు వదిలి !



ఆత్మకూరు పట్టణంలో ఓ హోటల్ వద్ద టిఫిన్ చేస్తున్న ఈ పిల్లలను చూస్తుంటే సంక్రాంతి సెలవుల్లో శ్రీశైలమో.. మహానంది క్షేత్రాలకో వెళ్తూ మార్గమధ్యలో ఆకలితో ఆగినట్లు అనిపిస్తుంది కదూ.. ఆ చిన్నారులకు ఇప్పుడు 'సుగ్గి' సెలవులు.. అదేంటీ మరో రెండు రోజుల్లో పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగుస్తుంటే ఈ సుగ్గి సెలవులు ఏంటని ఆశ్చర్యపోతున్నారా?. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో పనులు లేక పోవడంతో గుంటూరులో మిర్చి కోతలకు పిల్లాపాపలతో వ్యవసాయ కూలీలు, రైతులు వలస పోతున్నారు. ఆత్మకూరు మీదుగా రోజూ పదుల సంఖ్యలో కుటుంబాలు వలస వెళ్తున్నాయి. 'ఊళ్లో పనుల్లేవు..



ప్రభుత్వం ఆదుకోవడం లేదు.. అమ్మఒడి.. రైతు భరోసా ఏమి ఇవ్వలేదు. ఎట్లా బతకాలి'.. అంటూ ఆలూరు మండలం బిల్లేకల్లుకు చెందిన రాజశేఖర్, సుంకన్న తదితరులు వాపోయారు. – ఆత్మకూరురూరల్

ఆ.. టేస్టే వేరప్పా!



ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర అంటే.. మాంసం ప్రియులకు మాత్రం మటన్ కడ్డీలు గుర్తుకొస్తాయి. జాతరకు వచ్చిన వాళ్లలో మాంసాహారులు తప్పకుండా కడ్డీ మాంసం రుచి చూడందే వెళ్లరు. పట్టణంలోని ట్యాంక్‌బండ్ రోడ్డు, కమిటీ రోడ్డులో వెలసిన కడ్డీ మాంసం (మటన్ చీకులు) దుకాణాలు ఈ జాతర ముగిసే వరకు ఉంటాయి. వ్యాపారులు సుగంధ ద్రవ్యాలతో మసాల తయారు చేసి ముక్కలకు దట్టించి నిప్పులపై కాల్చి విక్రయిస్తున్నారు. కిలో కడ్డీ మాంసం రూ.800, చికెన్ కడ్డీలు కిలో రూ.200 – రూ.250 వరకు విక్రయిస్తున్నారు. జాతరకు వచ్చిన వారు కడ్డీ మాంసం తింటూ.. ఈ టేస్టే వేరప్పా అంటారు. – ఎమ్మిగనూరుటౌన్

ముగ్గురిని మింగిన అతివేగం

- ప్యాలకుర్తి వద్ద ఢీకొన్న కారు, ఐచర్ వాహనం
- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి
- కర్నూలు నుంచి తిరిగి వస్తుండగా దుర్ఘటన
- ఆస్పత్రి ఆవరణలో మిన్నంటిన బంధువుల రోదనలు
- కోడుమూరులో తీవ్ర విషాదఛాయలు



బండ శ్రీనివాసులు, సోమశేఖర్, రాజోలి శ్రీను (ఫైల్)



కోడుమూరు ఆస్పత్రి ఆవరణలో రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

కోడుమూరు రూరల్: అతివేగం ముగ్గురు వ్యక్తులను బలితీసుకుంది. శుక్రవారం ప్యాలకుర్తి వద్ద లారీ, ఐచర్ వాహనం ఎదురెదురుగా వేగంగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కోడుమూరుకు చెందిన సోమశేఖర్ (56), బండ శ్రీనివాసులు (46), రాజోలి శ్రీను (36) పట్టు వస్త్రాల వ్యాపారం చేస్తున్నారు. వీరు ముగ్గురు కారులో కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్యాలకుర్తి గ్రామ సమీపాన ఆర్‌టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న ఐచర్ వాహనం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులోని బండ శ్రీనివాసులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలకు గురైన సోమశేఖర్, రాజోలి శ్రీనులను చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. మృతుడు సోమశేఖర్ కోడుమూరులోని 16వ వార్డు సభ్యుడు. ఈయనకు భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బండ శ్రీనివాసులుకు భార్య శ్రీలలిత, ఇద్దరు కుమారులు, రాజోలి శ్రీనుకు భార్య సుమశ్రీ, ఇద్దరు కుమార్తెలు, ఏడాదిలోపు బాబు ఉన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, జెడ్‌పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ భాగ్యరత్న, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ సీబీ లత, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రి చేరుకున్నారు. మార్చురీలో ఉన్న మృతదేహాలను సందర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురిది ఒకే సామాజిక వర్గం కావడం, వరుసకు బంధువులు కావడంతో కోడుమూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కోడుమూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల కుటుంబీకుల, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రెండు వారాల్లో ఆరుగురు మృతి ..

కోడుమూరు – కర్నూలు రహదారిలో రెండు వారాల్లో మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో కోడుమూరుకు చెందిన ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల సమీపానే ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



ప్రమాదానికి కారణమైన ఐచర్ వాహనం

బీసీ రుణాల దరఖాస్తు తేదీలు త్వరలో ప్రకటిస్తాం

కర్నూలు(అర్బన్): జిల్లాలో బీసీ, ఈబీసీ, కాపు కులాల రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే తేదీలను ప్రకటిస్తామని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రుణాలకు సంబంధించి గతంలో ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడం జరిగిందన్నారు. అయితే ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ పలు సాంకేతిక కారణాలతో అందుబాటులోకి వచ్చేందుకు కొంత జాప్యం జరుగుతున్నదన్నారు. వెబ్‌సైట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన వెంటనే దరఖాస్తు తేదీలను ప్రకటిస్తామన్నారు.

స్వచ్ఛదివస్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి

- కలెక్టర్ రంజిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): 'న్యూ ఇయర్-క్లీన్ స్టార్ట్' అనే థీమ్‌తో నిర్వహించే స్వచ్ఛ దివస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛ దివస్, హౌసింగ్, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్‌ఎస్, ఉపాధి హామీ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి, అధికారులు, ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం జిల్లాలోని అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ప్రారంభించాలన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రతి మూడో శనివారం పచ్చదనం-పరిశుభ్రతను పాటించాలన్నారు. ఉపాధి హామీ పనుల కల్పనలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మంత్రాలయం, గూడూరు, గోనెగండ్ల, కోసిగి మండలాల్లో ప్రజలు వలస వెళ్తున్నారని, పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, అందుకు కారణాలపై ఎంపీడీఓలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న గోకులాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రీసర్వే గ్రామాల గ్రామ సభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ సర్వేలో జిల్లా పురోగతిలో వెనుకబడి ఉందని, వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, హౌసింగ్ పీడీ చిరంజీవి, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి పాల్గొన్నారు.

'విజయ'ం అడ్డుకునే కుట్ర

- విజయ డెయిరీ నామినేషన్ల స్వీకరణలో ఉద్రిక్తత
- ఎమ్మెల్యే అఖిలప్రియ వర్గీయుల హల్‌చల్
- శాంతిభద్రతల సమస్య అంటూ చేతులెత్తేసిన పోలీసులు
- వాయిదా పడిన నామినేషన్ల స్వీకరణ



డెయిరీ ఆవరణంలోకి చొచ్చుకొని వస్తున్న భూమా వర్గీయులను అడ్డుకుంటున్న పోలీసులు

నంద్యాల(అర్బన్): అడ్డదారిలో విజయ డెయిరీ చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే దురుద్దేశంతో టీడీపీ నేతలు బరితెగించారు. ప్రశాంతంగా జరగాల్సిన డైరెక్టర్ల ఎన్నిక ప్రక్రియ ఉద్రిక్తతకు దారి తీసి చివరికి వాయిదా పడేలా చేశారు. విజయడెయిరీలో మొత్తం 15 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఇందులో ఇటీవల ము గ్గురు డైరెక్టర్ల పదవీ కాలం పూర్తయ్యింది. శుక్రవారం ఆ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. విజయ డెయిరీ ఎండీ కార్యాలయంలో 11 నుంచి 2 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాల్సి ఉంది. పోటీ లేకపోతే ఎన్నికల అధికారులు ఇదే రోజు ఏకగ్రీవంగా డైరెక్టర్ ఎన్నికైనట్లు ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ వర్గీయులు ఎన్నికల్లో పోటీ చేస్తే గెలవలేమనే ఉద్దేశంతో ఎన్నిక వాయిదా వేయించేందుకు అలజడి సృష్టించినట్లు తెలుస్తోంది. తమను కాదని పోటీలో నిలిచే వారిని ముందుగా భయభ్రాంతులకు గురి చేసి తమ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా పథకం పన్నారు. ఈ క్రమంలోనే దాదాపు 30 వాహనాల్లో నంద్యాలలోని విజయ డెయిరీ వద్దకు చేరుకున్నారు. అయినా పలువురు ధైర్యంగా నామినేషన్ వేసేందుకు డెయిరీ లోపలికి వెళ్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు ఆఫీసులోకి వచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారించారు. అయినా తగ్గకుండా కేకలు వేస్తూ హల్‌చల్ చేశారు. వారిని అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసు లు చేతులెత్తేసి బందోబస్తు కల్పించలేమని ఎన్నిక వా యిదా వేయాలంటూ ఎన్నికల అధికారి రాంబాబుకు విన్నవించారు. విధిలేని పరిస్థితుల్లో ఎండీ ప్రదీప్‌కుమార్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అడ్డదారిలో చైర్మన్ పదవి కట్టబెట్టాలని..

అడ్డదారిలో డైరెక్టర్లను గెలిపించుకుని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డికి చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు టీడీపీ నాయకులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ముందుగా విజయ డెయిరీ పాలకమండలి సమావేశం జరగకుండా స్టే ఇవ్వాలంటూ ఇటీవల టీడీపీ నాయకులు హైకోర్టులో వేసిన పిటిషన్ తిరస్కరణకు గురైంది. ఎన్నికల నిర్వహణను అడ్డుకోవాలని చేసిన ప్రయత్నాలు సైతం విఫలమయ్యాయి. ప్రస్తుతం విజయడెయిరీ చైర్మన్‌గా ఉన్న ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ ఇటీవల డైరెక్టర్లు తీర్మానం చేశారు. దీంతో కార్యవర్గ సభ్యుల పదవీ కాలం ముగిసే వరకు అధ్యక్ష పదవికి ప్రత్యేక ఎన్నిక జరగాల్సిన అవసరం లేదు. అయితే ముగ్గురు డైరెక్టర్ల ఎన్నికల్లో తమ వారిని అడ్డదారిలో గెలిపించుకుని ఆ తర్వాత పావులు కదపాలనే దురుద్దేశంతోనే శుక్రవారం జరగాల్సిన ఎన్నిక ప్రక్రియను అడ్డుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

పథకం ప్రకారమే ఎన్నిక వాయిదా వేయించారు

- డెయిరీ ఎన్నిక సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): టీడీపీ నేతలు పథకం ప్రకారమే విజయ డెయిరీ డైరెక్టర్ల ఎన్నిక వాయిదా వేయించారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. అధికారం కలకాలం ఎవరి వద్ద ఉండదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక ఉదయానంద రెసిడెన్సిలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అఖిల ప్రియ చెప్పింది.. నామినేషన్లను అడ్డుకుంటామని టీడీపీ నాయకులు చెప్పడం దుర్మార్గమన్నారు. ఎవరినీ నామినేషన్ వేయనివ్వమని బెదిరించడం ఎంత వరకు సమంజసమన్నారు. ముందు ముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బయటి వ్యక్తులను డెయిరీ ఆవరణలోకి రాకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. విజయ డెయిరీ ముగ్గురు డైరెక్టర్ల ఎన్నికను వాయిదా వేయాలంటూ టీడీపీ నాయకులు హైకోర్టులో పిటిషన్ వేయడం దారుణమని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. విజయ డెయిరీకి అప్పు ఉన్న జగత్ విఖ్యాత్‌రెడ్డి డీఫాల్టర్ అయ్యారని, అటువంటి వారికి సంస్థలో చోటు లేదన్నారు. విజయడెయిరీ డైరెక్టర్ల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శాంతిభద్రతల సమస్య ఉందని ఎన్నికలు వాయిదా వేయాలని పోలీసులు కోరడం విడ్డూరంగా ఉందన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టివేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో గస్తీ నిర్వహించగా తుంగభద్ర నదితీర గ్రామం తిమ్మందొడ్డి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆరు టాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు (సిటీ): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పాఠశాల విద్య కడప ఆర్‌జేడీ శామ్యూల్‌కు ఎస్టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ)గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కె.శ్యాముల్‌ని ఎస్టీయూ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగేంద్రప్ప కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌ఎం/ఎంఈఓలకు పదోన్నతుల చానల్ పెంచాలని, క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధి పెరుగుతున్న నేపథ్యంలో గ్రేడ్–1 హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో సమాంతరంగా తెలుగు మీడియంను కొనసాగించాలన్నార. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపడుతున్న నేపథ్యంలో 2023లో పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులు, 2017 బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు లబ్ధి పొందే విధంగా కనీసం 2, గరిష్ఠంగా 8 విద్యా సంవత్సరాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్‌జేడీ హామీ ఇచ్చారు.

వైస్ చైర్మన్ హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

డోన్ టౌన్: ఈనెల 6న జరిగిన మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్‌పై హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. ఈనెల 6న గుత్తి రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వైస్ చైర్మన్ హరికిషన్‌ను సోమేష్ యాదవ్, సోమశేఖర్ యాదవ్ తోపాటు అనుచరులు షేక్ మహమ్మద్‌రఫీ, షేక్ దూద్ పీరా కలిసి వాహనంపై ఢీకొట్టారు. కింద పడిన వైస్ చైర్మన్ చూసి మృతిచెందాడని భావించి నిందితులు పారిపోయారు. హరికిషన్ ఫిర్యాదు మేరకు సీసీ పుటేజీలు పరిశీలించి ప్రమదానికి కారణమైన మహమ్మద్‌రఫీ, దూద్ పీరాలను అరెస్ట్ చేశారు. కాగా సోమేష్ యాదవ్, సోమశేఖర్ యాదవ్ తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్‌ఐ మస్తాన్ ఎదుట లొంగిపోయారని డీఎస్పీ తెలిపారు.

ఉండటానికి ఇల్లు లేదు.. తినడానికి తిండి లేదు.. కనీసం ఫలానా అని చెప్పేందుకు కూడా వారికి చిరునామా లేదు. అటు రేషన్ కార్డు లేక.. ఇటు ఆధార్ కార్డులేక ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నారు. సమాజం నుంచి వెలివేసినట్లు తిప్పపై పూరి గుడిసెల్లో నివాసముంటూ కలోగంజో తాగి బతుకీడుస్తున్న యానాదులు తామెవరమో చెప్పాలంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.



సొంత ఇల్లు లేక గుడిసెలో ఉంటున్న అవ్వ వెంకటమ్మ

ఇంతకూ మేమెవరం?

చిరునామా లేని యానాదుల కుటుంబాలు

- సీమలతిప్పపై గుడిసెల్లో జీవనం
- ఆధార్, రేషన్ కార్డులకు నోచుకోని వైనం
- ప్రభుత్వ పథకాలకూ దూరం

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామ సమీపంలో సీమల తిప్పపై 50 కుటుంబాల యానాదులు జీవనం సాగిస్తున్నారు. దాదాపు 40 ఏళ్ల క్రితం వివిధ గ్రామాల నుంచి వలస వచ్చి గిద్దలూరు సమీపంలోని సీమల తిప్పపై స్థిరపడ్డారు. వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ఫారెస్ట్‌లో మొక్కలు నాటే పనికి వెళ్తూ జీవనం సాగిస్తూ వస్తున్నారు. పురుషులు కొండకు వెళ్లి తేనె తీయడం, బొగ్గులు కాల్చడం తదితర వాటి ద్వారా వచ్చిన కాస్తోకూస్తో ఆదాయంతో కుటుంబాలను భారంగా పోషించుకుంటున్నారు. చిన్నచిన్న గుడిసెల్లో ఉమ్మడి కుటుంబాలు బతుకు పోరాటం చేస్తున్నాయి. ఆధార్, రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందక సమాజంలో గుర్తింపు లేక చితికి పోతున్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో వారికి అవి ఇస్తా ఇవి ఇస్తామంటూ హామీలు ఇచ్చి ఆ తర్వాత ముఖం చాటేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

40 ఏళ్ల నుంచి తిప్ప మీద చిన్న గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయినా చాలా కుటుంబాలకు ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు లేవు. ఆధార్ కార్డు చేయించుకునేందుకు వెళ్తే రేషన్ కార్డు కావాలంటారు. రేషన్ కార్డు రేయించుకునేందుకు వెళ్తే ఆధార్ కార్డు తీసుకురమ్మంటున్నారు. దీంతో వారికి దిక్కుతోచక మిన్నకుండి పోతున్నారు. ఫలితంగా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. ఎస్టీల అభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ ఏ మాత్రం చొరవ చూపక పోవడంతోనే వారికి ఈ దుస్థితి దాపురించింది.



సీమలతిప్పపై యానాదుల పూరి గుడిసెలు



కట్టెల పొయ్యిపై వంట తయారు చేసుకుంటున్న మహిళ

“ గుడిసెలోనే బతుకుతున్నాం



చిన్న గుడిసెలో మూడు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాం. సొంత ఇల్లు లేదు. ఎన్నికల ముందు నాయకులు వచ్చి ఇండ్లు కట్టిస్తామని చెప్పి వెళ్లారు. ఆ తర్వాత పట్టించుకోరు. మా బతుకులు ఇంతే. ఏదో కొండకు పోయి తేనె తీసుకొచ్చి గ్రామాల్లో అమ్మి దాని ద్వారా వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఒక్కోరోజు తేనె దొరకదు. అధికారులు స్పందించి మాకు ఇల్లుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– నరసింహుడు, యానాదుల కాలనీ, గిద్దలూరు గ్రామం

ఆధార్ కార్డులు లేవు



మా కాలనీలో చాలా కుటుంబాలకు ఆధార్, రేషన్ కార్డులు లేవు. అవి లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. సొంత గృహాలు లేక గుడిసెల్లో ఉంటున్నాం. కాలనీలో కనీసం ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదు. కూలీ పనులకు వెళ్తాం. కొండకు వెళ్లి తేనె తీసి కేజీ రూ.500 చొప్పున అమ్ముకుంటాం. ఒక్కో రోజు పస్తులు ఉండాల్సి వస్తోంది.

– సుబ్బరాయుడు,యానాదులకాలనీ, గిద్దలూరు

“ ఒకే గుడిసెలో మూడు కుటుంబాలు



చిన్న పాటి గుడిసెలో మూడు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాం. ఒకరు ఇంట్లో ఉంటే మరో ఇద్దరు బయట పడుకోవాలి. వర్షం వస్తే ఆరోజు జాగారమే. అందరూ కూర్చొనే ఉంటాం. ప్రభుత్వాలు మారుతున్నా మా బతుకులు మారడం లేదు. మాలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

– మలికి పెద్దక్క, యానాదుల కాలనీ, గిద్దలూరు గ్రామం

పింఛన్ రావడం లేదు



నాకు భర్త లేదు. అమ్మ వద్ద ఉంటూ దుర్భర జీవనం గడుపుతున్నాం. పింఛన్ కోసం చాలా సార్లు అధికారుల చుట్టూ తిరిగినా మంజూరు చేయలేదు. ఏ ఒక్క ప్రభుత్వ పథకమూ మాకు అందలేదు. సొంత ఇల్లు లేదు. చిన్నగుడిసెలో ఉంటున్నాం. అధికారులు స్పందించి మాకు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– పుల్లమ్మ, యానాదుల కాలనీ, గిద్దలూరు

శిలాఫలకం ధ్వంసం



ఇసుకవాగు వంతెన నిర్మాణం పనులకు భూమిపూజ చేసి నిర్మించిన శిలాఫలకం



వాగు వద్ద ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ హయాంలో 2023 ఆగస్టు 8న అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్, తదితరులు భూమిపూజ చేసి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. ఈనేపథ్యంలో పారుమంచాల ఇసుకవాగు వంతెన నిర్మాణం పనుల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు వాహనంతో ఢీకొట్టి ధ్వంసం చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు ఉపయోగపడేలా వంతెన నిర్మాణం పనులు జరుగుతుండగా గిట్టనివారు శిలాఫలకం ధ్వంసం చేయడం సబబుగా లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కేశవరెడ్డి గారి నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

చిన్నారుల అదృశ్యం కేసులపై సమీక్ష

కర్నూలు(అర్బన్): జిల్లాలో చిన్నారుల అదృశ్యం కేసులపై సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి సమీక్షించారు. శుక్రవారం స్థానిక న్యాయ సేవా సదన్‌లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమీక్షలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదాబేగం, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, అసిస్టెంట్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రేవతి జ్యోత్స్న, మహిళా పోలీస్ స్టేషన్ ఆఫీసర్ మద్దిలేటి, డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ శేషు తదితరులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో గుర్తించబడని పిల్లల కేసులపై తీసుకున్న చర్యలపై చర్చించి వివరాలు సేకరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు తమ స్వాధీనంలో ఉన్న పిల్లలకు తాత్కాలికంగా షెల్టర్ ఇచ్చి తల్లిదండ్రులను పిలిపించి వారికి వారి పిల్లలను అప్పగించామని డీసీపీఓ శారద తెలిపారు.



సమీక్ష నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బి.లీలావెంకటశేషాద్రి

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

- ఇప్పటి వరకు ఆరుగురిని కటకటాలకు పంపిన పోలీసులు
- మరో నలుగురి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సోమన్న

ఆదోని అర్బన్: బతికున్న వ్యక్తిని మృతిచెందాడని నమ్మించి, మృతిచెందిన వ్యక్తి తన తండ్రి అని ఫేక్ డెత్ సర్టిఫికెట్, ఫేక్ ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రధాన నిందితుడు ఆముదాల భాస్కర్‌ను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వివరాలను సీఐ సూర్యమోహన్‌రావుతో కలిసి డీఎస్పీ సోమన్న శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. గత నెల 31న బతికున్న ఎగ్గటి ఈశ్వరప్ప మృతిచెందాడని నకిలీ డెత్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో ఆముదాల భాస్కర్ తన వారసత్వమని సృష్టించి, చాకలి ఈరన్నకు భూమిని రిజిస్ట్రేషన్ చేయించిన విషయం విధితమే. ఈ వ్యవహారంపై పది మందిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఏ1 నిందితుడు ఆముదాల భాస్కర్‌ను తాజాగా అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఇదే కేసుకు సంబంధించి సబ్‌రిజిస్టర్ హజీమియా, రిజిస్ట్రేషన్ చేసుకున్న చాకలి ఈరన్నతోపాటు ఇద్దరు సాక్షులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. చాకలి ఈరన్నపై ఎమ్మిగనూరులో ఇలాంటి అక్రమ కేసులు నమోదై ఉన్నాయన్నారు. కాగా అప్పుడులో సబ్‌రిజిస్టర్ హజీమియాపై కేసు నమోదైందన్నారు. ఇందులో భాగంగా ప్లాట్లు ఇస్తామని ఇద్దరు రైతులు అయ్యన్న, చిన్నప్పలు ఒక్కొక్కరితో రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలు తీసుకున్నారన్నారు. మిగతా నలుగురు పట్టుబడితే ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక ఎవరున్నారన్నది తెలుస్తుందన్నారు. ఇదిలా ఉండగా గురువారం అక్రమ రిజిస్ట్రేషన్‌ను ఆముదాల భాస్కర్‌తో పోలీసుల సమక్షంలో రద్దు చేయించారు.

కూటమి నేతల ఆగడాలకు అడ్డుకట్ట వేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎస్పీతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లాలో కూటమి నేతల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణరెడ్డితో కలిసి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎస్పీని ఆయన కార్యాలయంలోనే కలిసి కూటమి నేతల దౌర్జన్యాలను వివరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం గ్రామంలో నీలం సంజీవకుమార్‌రెడ్డికి చెందిన మునగ పంటను ధ్వంసం చేశారన్నారు. 3.50 ఎకరాల్లో చేతికి అందే దశలో ఉన్న మునగ దిగుబడులను దుండగులు ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. బాధితుడు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా ఉన్నాడనే కారణంతో కూటమి నేతలు పంటను ధ్వంసం చేయడం తగదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరామన్నారు.

- ఓడీఎఫ్ ప్లస్, మోడల్ విలేజ్ డిక్లరేషన్ పూర్తికి చర్యలు

పల్లెల పరిశుభ్రతకు ప్రాధాన్యత



చర్చిస్తున్న డీపీఓ, జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

కర్నూలు(అర్బన్): క్లీన్ స్టార్ట్ థీమ్ కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ సూచించారు. శుక్రవారం డీపీఓ కార్యాలయంలో డీపీఓ భాస్కర్, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి సమావేశమై పరిశుభ్రతకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. గ్రామాల్లో చెత్త పదార్థాలను ఏరివేయడం, చెత్త దిబ్బలను తొలగించడం, పబ్లిక్ స్థలాలను (బస్టాప్, మార్కెట్ తదితరాలు) శుభ్రం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయించడం, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణను 5 శాతం పెంచడం, ఘన వ్యర్థ పదార్థాలను వేరు చేయడం, అన్ని పబ్లిక్ టాయిలెట్లను పనిచేసేలా చూడటం, దోమల పెరుగుదలను నివారించి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్ సహాయక ఇంజినీర్లు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన ఓడీఎఫ్ ప్లస్, మోడల్ విలేజ్ డిక్లరేషన్‌ను ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసేందుకు నిర్దిష్టమైన ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.

భూముల మార్కెట్ విలువ పెంపుపై సమీక్ష

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల మార్కెట్ విలువను పెంచాలని ఆదేశించిన నేపథ్యంలో జిల్లా అధికారులు కసరత్తు చేపట్టారు. శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి తన కార్యాలయంలో జిల్లాలోని 11 మంది సబ్ రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. కాగా ఇప్పటికే ఆయా సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో ఎక్కడ.. ఎంతెంత విలువను పెంచాలో సబ్ రిజిస్ట్రార్లు సిద్ధం చేసిన నివేదికను జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ జెడ్పీ సీఈఓ, జేసీలతో వేర్వేరుగా సమావేశమై భూముల విలువ పెంపుపై సమీక్షించారు. ఈనెల 25న కలెక్టరేట్‌లో జరిగే తుది సమావేశంలో భూముల విలువ పెంపుపై నిర్ణయం తీసుకుంటారు. ఆ నివేదికను జేసీ ప్రభుత్వానికి పంపుతారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన భూ విలువలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

ఫేక్ ఐడీలతో మోసం

శ్రీశైలం: ద్వాదశ జ్యోతిర్లింగమైన శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వేలాది మంది భక్తులు వస్తున్నారు. సైబర్ నేరగాళ్లు మల్లికార్జున సదన్, గంగా గౌరీ సదన్, గౌరీ సదన్, పాతాళేశ్వర సదన్ వంటి వివిధ పేర్లతో ఫేక్ ఐడీలు సృష్టించి భక్తులను మోసం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మహేష్ రూ.2 వేలు చెల్లించి మల్లికార్జున సదన్ పేరున జిరాక్స్ కాపీ పొందారు. శ్రీశైలం వచ్చి మల్లికార్జున సదన్‌లో ఉన్న సిబ్బందికి జిరాక్స్ కాపీని చూపించగా ఫేక్ ఐడీ ద్వారా వచ్చిందని వారు తెలియజేశారు. నకిలీ ఐడీలతో మోసపోయిన వారు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సైబర్ క్రైం 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే దేవస్థానం ఈఓకు ఫిర్యాదు చేసి ఆ ఫిర్యాదును వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పంపినట్లయితే పోలీసులు సైబర్ నేరం కింద కేసు నమోదు చేస్తారు.

తాడిపత్రిలో దారుణం

- వివాహేతర సంబంధం వద్దని వారించిన భార్య
- వేటకొడవలితో భర్త దాడి
- తీవ్ర రక్త స్రావమై మృతి



పుష్పావతి (ఫైల్)



నిందితుడు వెంకటేశ్వర్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: వివాహేతర సంబంధం అనర్థాలకు దారి తీస్తుందని భార్య నెత్తి నోరు బాదుకున్నా.. వినలేదు. పైగా పరాయి మహిళపై భర్తకు మక్కువ మరింత పెరిగింది. కొన్ని రోజులు దూరంగా ఉంటే మార్పు వస్తుందనుకుంది. ఆశించిన ఫలితం దక్కలేదు. చివరకు తన జల్సాల కోసం ఆస్తిని అమ్మకానికి పెడితే వద్దని వారించిన భార్యను వేటకొడవలితో నరికి హతమార్చాడు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లికి చెందిన పుష్పావతి(37)కి 14 ఏళ్ల క్రితం పుట్లూరు మండలం చల్లిడి వెంగన్నపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా గ్రామంలోని మరో మహిళతో వెంకటేశ్వరరెడ్డి వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న పుష్పావతి తన భర్తను వారించింది. వివాహేతర సంబంధాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలను వివరించింది. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో తరచూ కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటుండంతో కొంత కాలం తాను దూరంగా ఉంటేనైనా భర్తలో మార్పు వస్తుందని భావించిన ఆమె నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది.

ఆస్తిని అమ్మకానికి పెట్టి

పరాయి మహిళ మోజులో ఉన్న వెంకటేశ్వరరెడ్డి తన కుటుంబాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో జులాయిగా మారి తన పేరున ఉన్న స్థిరాస్తులను అమ్ముకుని జల్సాలు చేయసాగాడు. చివరగా మిగిలిన రెండు ఎకరాల భూమిని అమ్మేందుకు సిద్ధపడడంతో విషయం తెలుసుకున్న పుష్పావతి అప్రమత్తమైంది. భూమి అమ్మకాన్ని అడ్డుకుంది. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ ఏర్పాటు చేశాడు. శుక్రవారం ఉదయం తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో ఉన్న ఓ లాడ్జీలో పెద్ద మనుషులను సమావేశ పరిచాడు. గదిలోపల పెద్ద మనుషులు మాట్లాడుకుంటుండగా పుష్పావతి బయట కూర్చొని ఉంది. అనంతరం గదిలోకి వెళ్లిన భార్యను 'పొలాన్ని అమ్ముతాను సంతకం చేస్తావా? లేదా?' అంటూ వెంకటేశ్వర్‌రెడ్డి బెదిరింపు ధోరణితో అడిగాడు. ఆ సమయంలో ఆమె ససేమిరా అనడంతో అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న వేటకొడవలితో నరికి పారిపోయాడు. అక్కడున్న వారు వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలోనే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వెంకటేశ్వర్‌రెడ్డి కోసం గాలింపు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మీ కుటుంబ ఉజ్వల భవిష్యత్తుకి మీరు ఇచ్చే చిరు కానుక రైతు నగరం DTCP లే అవుట్ శ్రీ చైతన్య స్కూలు ఎదురుగా 8 ఎకరాలు గేటెడ్ కమ్యూనిటీ మరియు చాపిరేవుల టోల్‌ప్లాజా హైవే అనుకొని నంది ప్యారడైజ్ ప్రక్కన Ready to Construction Layout సంప్ర: 81869 95214, 89194 74693 [L-783248]

HOUSE FOR SALE

■ (2018) 2BHK, 22X60, WEST FACE, Independent House with Compound Wall, Bore & MPL Water. Ghouse Masjid Lane, GaneshNagar-2, KNL. Cell: 8019499349. No Agents. [L-783247]

LAND FOR SALE

■ జూపాడుబంగ్లా మండలము, పారుమంచాల గ్రామంలో 3 ఎకరాల నల్లరేగడి పొలము అమ్మకమునకు కలదు. కొనదలచిన వారు సంప్ర : 8919171764, 8106838747 [C-820522]

WANTED

■ అధిక ఆదాయం, పెట్టుబడి లేదు, అమ్మకాలు కావు, మార్కెటింగ్ కాదు. Weekly and Monthly Incomes. 25 మంది లీడర్లకు అవకాశం. Age: 20+. 83099 49116, 99080 05038 [L-794712]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు లేడి టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+కమీషన్ ఇవ్వబడును. సంప్ర: కర్నూలు. 6300265849 [L-783246]

■ గ్రీన్ కోసోలార్ & హైడ్రోపవర్ (ఓర్వకల్లు, కర్నూలు జిల్లా) నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ:16,000/-, రూమ్ ఉచితం. అడ్రస్: కాల్వబుగ్గ టెంపుల్ ప్రక్కన. సంప్ర: 8106184820, 9652975114. [L-783245]

■ శ్రీ శక్తి ఫైనాన్స్ నందు పనిచేయుటకు ఫీల్డ్ స్టాఫ్ కావలెను. అర్హత: ఇంటర్, ఆపైన, సంప్ర:: 4th ఫ్లోర్, K.S.ఐకాన్ షాపి కాంప్లెక్స్, బిర్లా కాంపౌండ్, కర్నూలు. (యూనియన్ బ్యాంక్ కాంప్లెక్స్). సెల్: 834138012, 9502766466. [L-794710]

■ కర్నూలు, అలంపూర్, నన్నూరు, వెల్దుర్తి, కాల్వబుగ్గలో గల ప్రముఖ టొబాకో కంపెనీ గోడౌన్స్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. అర్హత: 10th P/F. జీతం: 12 నుండి 13 వేలు. కొన్ని చోట్ల రూం మరియు భోజన వసతి కలదు. సంప్ర: 96524 47856, 95817 76925 [L-1259431]

■ AP TS NEWS APP: లేడీ టెలికాలర్స్, టీం లీడర్స్ కావలెను. జీతం: 10వేల నుండి 30వేల వరకు. సంప్ర:: 2nd ఫ్లోర్, షాపి నెం: 223, జగదీష్ మాల్, బిర్లా గేట్, కర్నూలు. సెల్: 94403 84846. [L-794711]

■ ప్రముఖ Quasi బ్యాంక్ నందు మార్కెటింగ్ చేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ & సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం : 8K to 28K + incentive. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. : 70750 34267. [N-1256630]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [M-0983560]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999 [HA-99571]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073, [SCA25001195]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



జెండర్ ఈక్వాలిటీ



ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

ఇంటింటా లక్ష్మీకళ

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పది హేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లి నట్లే. అయితే కథ అక్కడితో ముగిసి పోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏయస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు. ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడబిడ్డను ఎలా బతికించుకోవాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మీ యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మీ యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మీ యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మీ యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మీ యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్,
సాక్షి ప్రతినిధి
కరీంనగర్

సమాజ హితం కోసం...

ప్రకృతికి దగ్గరగా



డాక్టర్ చెన్నమనేని పద్మ



పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని అంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్థాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.





పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో కోర్సు చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైర య్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సహజ సిద్ధంగా...

ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ,
విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త









● నగధగలు ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!



ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

- ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.
- నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.
- ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.
- రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.



జియా నస్రీన్
జెమాలజిస్ట్

సోషల్ మీడియా

బామ్మ కోసం... ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!



బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటేగానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్ల నీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

వంటిల్లు

హెల్దీ లంచ్ బాక్స్

స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.

పనీర్ బటర్ మసాలా



కావలసినవి: పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; ఉల్లిపాయ ముక్కలు – ముప్పావు కప్పు; టొమాటో ముక్కలు– కప్పు; వెల్లుల్లి రేకలు– 4; అల్లం తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2; జీడిపప్పు– పది పలుకులు; పాలు– అర కప్పు; మీగడ – పావు కప్పు; కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు – టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; వెన్న – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తరుగు– 3 టేబుల్ స్పూన్‌లు.

పోపు కోసం... నూనె – టేబుల్ స్పూన్; యాలకులు – 2; లవంగం – 1; దాల్చిన చెక్క – అంగుళం ముక్క;

తయారీ: ● పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. ● బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

పీస్ పులావ్



కావలసినవి: బాసుమతి బియ్యం – కప్పు; పచ్చి బఠాణీ– పావు కప్పు; నీరు – 3 కప్పులు; బిర్యానీ ఆకు – ఒకటి; యాలక్కాయ – 1; లవంగం – 1; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నిమ్మరసం – అర టీ స్పూన్.

పోపు కోసం... నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి– 1 (నిలువుగా చీరాలి); షాజీరా– టీ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. ● నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

గమనిక: ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.